
ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5
విజయనగరం



## 8న ట్రైబల్ వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 9న నుంచి 12వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరిగే ఆలిండియా ట్రైబల్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఈ నెల 8న విశాఖలోని రైల్వే మైదానంలో రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టివై భగవాన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన క్రీడాకారులకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు ఒరిజినల్ తీసుకురావాలని తెలిపారు. కుల ధ్రువపత్రం లేకుంటే ఎంపిక ప్రక్రియకు అనుమతించబోమని స్పష్టంచేశారు. ఎంపిక చేసిన రాష్ట్ర జట్టు అదే రోజు టోర్నమెంట్‌కు బయల్దేరుతుందని చెప్పారు.

# ఫీ 'జులుం'

- వేళ్లూనుకుంటున్న విద్యా వ్యాపారం
- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు
- అమలుకు నోచని జిఒలు



**కార్పొరేట్ విద్య... అత్యుత్తమ విద్య... నాణ్యమైన విద్య... పేరేదైనా అంతిమ లక్ష్యం విద్యా వ్యాపారమే. జిల్లాలో ఇప్పుడు అక్షరాలా అదే సాగుతోంది. గతంలో విజయనగరం, బొబ్బిలి వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితమైన కార్పొరేట్ పాఠశాలలు నేడు మండల కేంద్రాలకూ విస్తరించి వేళ్లూనుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలకూ సరితూగని కొన్ని పాఠశాలలూ అనధికారికంగా టెక్నో, ఇ-టెక్నో, కాన్సెప్ట్, ఐఐటి తదితర పేర్లతో ఫీజుల వసూళ్లలో మాత్రం ముందువరుసలో ఉంటున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒలేవీ జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు.**

ప్రజాశక్తి - విజయనగరం

తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడంలో కొన్ని కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఆరితేరాయి. ఆయా పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాల మాట ఎలా ఉన్నా కరపత్రాలు, బ్రోచర్లు, ప్రకటనల ద్వారా వారు చేస్తున్న ప్రచార పటోపానికి విద్యావంతులైన తల్లిదండ్రులూ మోసపోతున్నారంటే, ఆ ప్రచారం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రచార భ్రమలో పడి ప్రభుత్వ పాఠశాలల్లో సాధిస్తున్న ఫలితాలను పక్కన పడేసి, కార్పొరేట్ పాఠశాలల వైపు తాహతుకు మించి పరుగులు తీస్తున్నారు. ఈ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే తక్కువే. మెరుగైన ఫలితాలు సాధించని విద్యార్థులే ఎక్కువగా ఉంటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అరకొర విద్యార్థులనే ఆయా పాఠశాలలు ప్రచారాలకు వాడుకుంటున్నాయి. ఈ హంగూ ఆర్భాటాలను ఏమాత్రమూ పట్టించుకోని తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థల మోజులో పడి జేబులు ఖాళీ చేయించు కుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యను బోధిస్తూ, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. ఇవే అర్హతలు ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రధానంగా కార్పొరేట్ పాఠశాలల్లో పరిశీలిస్తే ఎక్కడో తప్ప మచ్చుకైనా కనిపించవు.

### ఇష్టారాజ్యం

జూన్ 12వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ప్రయివేటు విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాయి. విద్యార్థుల వేట కోసం మండుటెండలోనూ గడప గడపా తొక్కుతున్నాయి. వేసవి సెలవుల్లో అడ్మిషన్లు చేపట్టరాదని నిబంధనలున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటికితోడు ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 2012 జులై 30వ తేదీన ప్రభుత్వం జిఒ నంబరు 42ను జారీ చేసింది. దీని ప్రకారం ఆయా విద్యాసంస్థలు కల్పించే సౌకర్యాలను బట్టి అర్బన్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యకు విద్యార్థుల నుంచి నెలకు రూ.750, ఏడాదికి రూ.తొమ్మిది వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.650, ఏడాదికి రూ.7,800లోపు వసూలు చేయాలి. హైస్కూల్ విద్యకు అర్బన్ పరిధిలో నెలకు రూ.వెయ్యి, ఏడాదికి రూ.12వేల లోపు వసూలు చేయాలి. రూరల్ పరిధిలో నెలకు రూ.900, ఏడాదికి రూ.10,800లోపు వసూలు చేయాలి. ఈ నిబంధనలు మచ్చుకైనా కనిపించడం లేదు.

### అమలుకు నోచని జిఒలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో సుమారు 3 లక్షల మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ విద్యనభ్యసిస్తున్నారు. సుమారు 80 వేల మందికి పైగా విద్యార్థులు ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యశిస్తున్నారు. జిల్లాలో సుమారు 400 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉంటే, సుమారు 70 వరకు గుర్తింపు లేని పాఠశాలలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు ఐదో తరగతి వరకు అనుమతులుంటే, ఏడో తరగతి వరకు బోధిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలు ఏడో తరగతి వరకు అనుమతులుంటే, పదో తరగతి వరకు బోధిస్తున్నాయి. ఇలాంటి విద్యాసంస్థల్లోనూ ఫీజులు చుక్కలు చూపిస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల పేరుతో వసూలు చేస్తున్న ఫీజులే కాక బస్సు, దుస్తులు, బూట్లు, పుస్తకాలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితా చాంతాడంత ఉంటుంది. వీటి కోసం వేలకు వేల రూపాయలు తల్లిదండ్రుల నుంచి అప్పనంగా గుంజుతున్నారు.

కార్పొరేట్ పాఠశాలల పరిస్థితి అయితే ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. ఏడాదికి సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం కనిష్ట స్థాయిలో జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. కుటుంబ పోషణకే జీతాలు చాలడం లేదని, పెంచాలని ఉపాధ్యాయులు ఒత్తిడి తెస్తే, వారిని తొలగించిన సందర్భాలు కోకొల్లలు. దీంతో మిగిలిన వారు నోరెత్తలేక ఇచ్చిందే మహా ప్రసాదంగా సరిపెట్టుకొని మిన్నకుంటున్నారు. నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలను మూసివేసే ప్రయత్నం ప్రభుత్వం చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని, ఫీ'జులుం'పై విద్యాశాఖాధి కారులు కొరడా ఝుళిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆ దిశగా అధికార యంత్రాంగం కదులుతుందో, లేదో ఆచరణలో చూడాల్సి ఉంది.

# తప్పులు దొర్లితే తలనొప్పులే

- రీసర్వేపై అధికారుల ఒత్తిడి
- పనిభారంపై ఉద్యోగుల ఆందోళన
- నియామకాలు చేపట్టాలని డిమాండ్



డ్రోన్ సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

**ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సమగ్ర భూ సర్వే నత్తనడకన సాగుతోంది. సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలే ఇందుకు కారణం. నియామకాలు పూర్తిస్థాయిలో చేపట్టడంతోపాటు ఒత్తిడి తగ్గించాలంటూ కొంతకాలం క్రితం సచివాలయ సర్వేయర్లు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయడమే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఒత్తిడితో తప్పులు తడకలు దొర్లితే భూ హక్కుదారుల జీవితాలే తారుమారు అవుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 983 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 807 గ్రామాల్లో 2,796.70 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో డ్రోన్ సర్వే పూర్తయింది. మొదటి దశలో 179 గ్రామాల్లో 84,327 ఎకరాల భూమిలో రీసర్వే పూర్తి చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో పూర్వం 50,299 భూమి ఖాతాలు ఉండగా, తాజా సర్వేతో ఈ సంఖ్య 61,751కి పెరిగింది. సబ్‌డివిజన్లు కూడా 92,541 నుంచి 1,94,606కి పెరిగాయి. దీన్ని బట్టి ఆ మేరకు భూ కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టినట్టుగా స్పష్టమౌతోంది. పెరిగిన జనాభా, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పంపకాలే ఇందుకు కారణమని రెవెన్యూ అధికారులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి మొదటి దశ భూ సర్వే జనవరి నెలాఖరు నాటికే పూర్తి అయినట్టు అధికారులు ప్రకటించారు. తాజాగా 300 గ్రామాల్లో చేపట్టిన రెండో దశ భూసర్వే జులైలోపు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీచేశారు. దీన్నిబట్టి సర్వే పూర్తిచేయడానికి కేవలం ఐదు నెలలు సమయం పట్టినట్లు స్పష్టమౌతోంది.

ఖాతాలు, సబ్ డివిజన్ల సంఖ్య పెరగడం వల్ల ఖాతాదారులకు నష్టాలు లేకున్నా, కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం వల్ల గట్ల రూపంలో కొంత భూమి వృథా కావడం అనివార్యమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. మన జిల్లాలో చిన్న, సన్నకారు రైతులే అధికం. ఎకరా నుంచి మూడెకరాలలోపు ఉన్నవారే ఎక్కువ. అన్నదమ్ముల వాటాలు, క్రయ విక్రయాలు ఎక్కువగా జరగడం వల్ల లింకు డాక్యుమెంట్లు సరిచూడటానికి చాలా సమయమే పడుతుందని సర్వేయర్లు, తహశీల్దార్లు చెబుతున్నారు.

### సిబ్బందిపై పనిభారం

సర్వే పేరిట అధికార యంత్రాంగం హడావుడి చేస్తున్నప్పటికీ, అదనపు సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. చాలాచోట్ల నత్తనడకన సాగుతోంది. సర్వేను వేగవంతం చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో తహశీల్దార్, విఆర్ఒ, విఆర్ఎ, సర్వేయర్లు ఎలాగోలా పూర్తిచేయాలన్న నిర్ణయానికి వస్తున్నారు. ఇదే పరిస్థితి ఏర్పడితే గతంలో వెబ్‌ల్యాండ్‌లో జరిగిన తప్పిదాలే పునరావృతమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వంలో వెబ్‌ల్యాండ్ పేరిట రెవెన్యూ యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి చేయడంతో ఒకరి భూమి, మరొకరి పేరున ఆన్‌లైన్ అయింది. దీంతో, ఇప్పటికీ రైతులు, స్థల యజమానులు అనేక పాట్లు పడుతున్నారు. అందులోనూ ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రస్తుత పరిస్థితిని యథాతథంగా రికార్డు చేసే విధానం కాదు. ఎన్ని క్రయవిక్రయాలు జరిగినా ప్రస్తుత యజమాని పేరిట రికార్డు కావాలి. ఏ విధంగా సంక్రమించిందో స్పష్టంచేయాలి. ప్రభుత్వ భూములను, ఆక్రమణలను గుర్తించాలి. ఇప్పటికే ఆక్రమించుకున్నవారు తమ పేరును రాయించుకునేందుకు ప్రయత్నాలు చేయవచ్చు. ఇవన్నీ క్షణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా పాస్‌పుస్తకాలు కూడా జారీ చేయడమంటే మాటలు కాదు. ఈ నేపథ్యంలో రీసర్వే ఆదరాబాదరాగా చేపడితే భూ యజమానులు నష్టపోయే ప్రమాదం కనిపిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## జెవివి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జన విజ్ఞాన వేదిక ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తల ప్రాంతీయ శిక్షణ తరగతులు ఆదివారం విజయనగరంలో జరిగాయి. ఈ శిక్షణలో సైన్సు-శాస్త్రీయ దృక్పథం.. అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగించారు. ప్రస్తుత తరుణంలో జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలుగా ఎటువంటి చైతన్యం కలిగి ఉండాలి, దేశంలో అశాస్త్రీయ పోకడలు ఏ విధంగా పెరుగుతున్నాయో వివరించారు.

శాస్త్ర విజ్ఞానం-మానవ వికాసం అనే అంశంపై జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్ ప్రసంగించారు. శాస్త్ర విజ్ఞానం మానవ మనుగడకు, అభివృద్ధికి ఏ విధంగా తోడ్పడింది, ప్రస్తుతం శాస్త్రీయ విజ్ఞాన ఫలాలు కొంతమందికే ఎందుకు అందుతున్నాయో తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక నిర్మాణం-కర్తవ్యాలు అనే అంశంపై జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు ప్రసంగించారు. భవిష్యత్తు కార్యక్రమాలను రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజగోపాల్, త్రిమూర్తులు రెడ్డి వివరించారు.




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

# కోటి చెరువు కబ్జా

- అక్రమంగా మట్టి తరలించి, చెరువు కప్పివేత
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



చెరువులో వేసిన మట్టి

**బొబ్బిలి పట్టణంలోని నాయుడుకాలనీ.. ఆర్‌టిసి కాంప్లెక్సుకు అత్యంత సమీపంలోని ప్రాంతం. ప్రస్తుతం అక్కడ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కాలనీకి ఆనుకుని కోటిచెరువు ఉంది. దీంతో ఆక్రమణదారుల కన్ను కోటి చెరువుపై పడింది. అంతే, రాత్రివేళల్లో పట్టణ సమీపంలోని చెరువులు, కొండల వద్ద మట్టి, గ్రావెల్ తరలించి, కోటిచెరువు ప్రాంతాన్ని కప్పేసి, చదును చేసి, కబ్జా చేస్తున్నారు. ప్లాట్లుగా వేసి విక్రయించాలని చూస్తున్నారు. ఇంతజరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.**

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 56లో కోటిచెరువు 72 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. నాయుడు కాలనీకి ఆనుకుని చెరువు ఉంది. నాయుడుకాలనీలో చదరపు గజం స్థలం రూ.15 వేలు నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతోంది. భూముల ధరలు పెరగడంతో కోటి చెరువును కప్పేసి ఆక్రమణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో చెరువుల్లో గ్రావెల్, రామన్నదొరవలస, మల్లంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న కొండలను అక్రమంగా తవ్వేసి లారీలలో మట్టిని తరలించి కోటి చెరువును కప్పేస్తున్నారు.

### అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు

పట్టణ సమీపంలో ఉన్న చెరువులు, కొండల వద్ద మట్టిని అక్రమంగా తవ్వి, తరలించి చెరువులు, ప్రభుత్వ స్థలాలను కప్పేసి కబ్జాకు పాల్పడుతున్నారు. అది కూడా రాత్రి సమయాల్లో గ్రావెల్, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. చెరువులను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి, గ్రావెల్ ఎక్కడ నుంచి వస్తుందో కూడా దర్యాప్తు చేయడం లేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోయి మట్టి, గ్రావెల్ తవ్వి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మున్సిపల్ ఉద్యోగి హస్తం!

కోటి చెరువు కబ్జా కోసం మట్టి తరలింపు వెనుక మున్సిపల్ ఉద్యోగి హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఒక ఉద్యోగి టిప్పర్ కొనుగోలు చేశారు. ఎవరికైనా మట్టి, గ్రావెల్ కావాలంటే జెసిబి యజమాని, మున్సిపల్ ఉద్యోగి కలిసి చెరువుల్లో లేదా కొండల వద్ద అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కోటి చెరువు కప్పేందుకు మున్సిపల్ ఉద్యోగి టిప్పర్‌తో మట్టిని తరలించినట్లు తెలిసింది. మట్టి వేస్తున్న సమయంలో పట్టణ నాయకుడొకరు వెళ్లడంతో టిప్పర్‌ను చెరువు వద్ద విడిచిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. దీంతో టిప్పర్ చెరువులోనే ఉంది. అక్రమ మట్టి తవ్వకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### కోటి చెరువు ఆక్రమణపై దర్యాప్తు

కోటిచెరువు ఆక్రమణపై దర్యాప్తు చేస్తున్నట్లు తహశీల్దార్ రాజారావు చెప్పారు. కోటి చెరువు పక్కన జిరాయతీ భూమి కూడా ఉన్నట్లు గుర్తించామన్నారు. మట్టివేసిన స్థలానికి ఎటువంటి పత్రాలు ఉన్నాయా? లేదా? అని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. చెరువులో మట్టి వేసి కప్పినట్లు నిర్ధారణ అయితే ఆక్రమణలు తొలగించి, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొబ్బిలిలో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ ఇవ్వలేదని స్పష్టంచేశారు. మట్టి ఎక్కడ నుంచి వచ్చిందో దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.



పరీక్షా కేంద్రం బయట విద్యార్థులు, తల్లిదండ్రులు

## జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-విజయనగరం

దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష విజయనగరం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జెఎన్‌టియు జంక్షన్‌లోని అయాన్ డిజిటల్ జోన్, సీతం ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగింది. అయాన్ డిజిటల్ జోన్‌లో 510 మంది, సీతం కళాశాలలో 180 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాలు కళకళలాడాయి.

## టెన్నికాయిట్ రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 16 నుంచి చెన్నైలో జరిగే సౌత్ ఇండియా టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపికను కస్పా స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. చైర్మన్ నడిపిన శ్రీనివాసరావు, అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, కోశాధికారి తవిటయ్య, జిల్లా కార్యదర్శి ఎం.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, శ్రీను, శివ, తిరుపతిరావు హాజరయ్యారు. పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసి, వీరికి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు.

# అక్రమ వాటర్ ప్లాంట్ ఎత్తివేయాలి

6న ప్లాంటు ముందే పోరాటం ● ఇంటింటా ప్రచారంలో పోరాట కమిటీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనావాసాల మధ్య నిర్వహిస్తున్న అక్రమ వాటర్ ప్లాంట్లను తక్షణమే సీజ్ చేయాలని, నిర్వాహకులను అరెస్ట్ చేయాలని పోరాట కమిటీ నాయకులు యు.ఎస్.రవికుమార్, ప్రసాద్, చౌదరి డిమాండ్ చేశారు. అక్రమ వాటర్ ప్లాంట్ ముందే 6న పోరాటం చేస్తామన్నారు. నగరంలోని అయ్యప్పనగర్‌లో ఆదివారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకత్వంలో మైక్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పందనలో కలెక్టర్‌కు, కార్పొరేషన్ అధికారులకు, భూగర్భ జల శాఖ అధికారి దుర్గాప్రసాద్‌కి వినతులు అందించినా, అక్రమ వాటర్ ప్లాంట్‌ను రద్దు చేయలేదన్నారు. అధికారులూ నోటీస్ ఇచ్చినా వాటర్ ప్లాంట్ యజమానులు వాటిని లెక్కచేయలేదని తెలిపారు. అక్రమ వాటర్ ప్లాంట్ల రద్దు కోసం ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని స్పష్టంచేశారు. అందులో భాగంగా అయ్యప్పనగర్ స్వామి లేఅవుట్‌లో ఉన్న అక్రమ వాటర్ ప్లాంట్ వద్ద పోరాటం చేస్తామని తెలిపారు.



మైక్ ప్రచారం చేస్తున్న యుఎస్ రవికుమార్, స్థానికులు

## క్రీడాకారులకు అన్యాయం జరగనివ్వం

**జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రీడాకారులకు అన్యాయం జరగనివ్వబోమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఆదివారం స్థానిక విజ్జి స్టేడియంలోని క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై ఆయన స్పందిస్తూ నకిలీ సర్టిఫికెట్లపై తనిఖీ చేశామని, అటువంటి ధ్రువపత్రాలను తొలగిస్తామని చెప్పారు. డబ్బులు తీసుకొని పక్క జిల్లా క్రీడాకారులను జట్టులోకి ఎంపిక చేస్తున్నామన్న విమర్శలు సరికాదన్నారు. రుజువు చేస్తే రాజీనామా చేస్తానన్నారు. జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించడంలో అసోసియేషన్ ముందుంటుందన్నారు. రాష్ట్రంలో ఎసిఎ నిబంధన ప్రకారం ఏ జిల్లా క్రీడాకారులనైనా ఆడుకోవచ్చని తెలిపారు. మన జిల్లా క్రీడాకారులకు తగిన ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే చూస్తామన్నారు. అనంతరం గత రెండేళ్లుగా సౌత్ జోన్ విన్నర్‌గా నిలిచిన సీనియర్ జట్టు క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి రాంబాబు, బంగార్రాజు, పుష్పరాజ్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 38, 42 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవాలు చేశారు. 38వ డివిజన్లో రూ.24 లక్షలతో చేపట్టిన రహదారి, 42 డివిజన్లో 8.60 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డును ప్రారంభించి, ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, పిన్నింటి కళావతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన డివిజన్లో కూడా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నగరంలో ప్రధాన జంక్షన్లతోపాటు శివారు ప్రాంతాల అభివృద్ధిపైనా కోలగట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే.. క్రిమినల్ చర్యలు



- గిరిజన యూనివర్సిటీ భూసేకరణ పూర్తి
- గ్రామాల్లో వేగవంతంగా రీసర్వే
- 'ప్రజాశక్తి'తో బొబ్బిలి ఆర్‌డిఒ పి.శేషశైలజ ముఖాముఖి

ప్రజాశక్తి-బొబ్బిలి


**ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బొబ్బిలి ఆర్‌డిఒ పి.శేషశైలజ హెచ్చరించారు. చెరువులు, ఇరిగేషన్ కాలువలు, ప్రభుత్వ భూమి, స్థలాలు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే వాటిని తొలగించి ఆక్రమణదారులకు హెచ్చరిస్తున్నామని, రెండోసారి ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టంచేశారు. భూ సమస్యల పరిష్కారానికి, అవినీతి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆర్‌డిఒ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...**

**? భూ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?.**

భూ సమస్యల పరిష్కారం నిరంతర ప్రక్రియ. భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తే సంబంధిత తహశీల్దార్లతో దర్యాప్తు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. సొంత భూములు రికార్డులలో నమోదు కాకపోతే రైతులు పూర్తి ఆధారాలు చూపిస్తే ఆన్‌లైన్ చేస్తున్నాం. రీసర్వేలో ప్రతి రైతు సమస్యనూ పరిష్కరిస్తున్నాం.

**? ప్రభుత్వ భూముల ఆక్రమణలపై తీసుకుంటున్న చర్యలేమిటి?.**

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమణ జరిగినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే దర్యాప్తునకు ఆదేశిస్తున్నాం. ఆక్రమణ రుజువైతే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణలకు పాల్పడితే మొదటిసారి వార్నింగ్ ఇచ్చి ఆక్రమణలు తొలగించి బోర్డులు ఏర్పాటు చేస్తాం. రెండోసారి ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతాం. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆక్రమణలు జరిగితే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి.




**? గిరిజన యూనివర్సిటీ భూసేకరణ ఎంత వరకు వచ్చింది?.**

గిరిజన యూనివర్సిటీ భూ సేకరణ పూర్తి చేశాం. 561 ఎకరాల భూమిని రైతులు నుంచి సేకరించాం. రైతులకు రూ.31 కోట్లు పరిహారం చెల్లించాం.

**? రెవెన్యూలో అవినీతి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలేమిటి?.**

రెవెన్యూలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాం. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత అవినీతికి ఆస్కారం లేదు. ఎక్కడైనా సిబ్బంది అవినీతికి పాల్పడితే ఫిర్యాదుచేయాలి. దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

**? రీసర్వే ఎంతవరకు వచ్చింది?.**

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే వేగవంతంగా సాగుతోంది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఇప్పటికే పాస్‌పుస్తకాలను కూడా పంపిణీ చేశాం. భూసర్వే వల్ల రైతులకు న్యాయం జరుగుతుంది. రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

# రైతన్న భవిష్యత్తుకు గ్యారంటీ : టిడిపి

ప్రజాశక్తి - భోగాపురం

రైతన్న భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తామని, అన్నదాతకు అండగా ఉంటామని, మహానాడులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మాజీ మంత్రి పతివాడనారాయణస్వామి నాయుడు అన్నారు. మండలంలోని చాకివలస గ్రామంలో నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ధరలు పెరిగి సబ్సిడీలు అందక సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని,



భోగాపురం: ఏరువాకలో భాగంగా దక్కుదున్నతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో 90శాతం పైగా రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయని గుర్తు చేశారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో ఆత్మహత్యలు 60శాతంకి పైగా పెరిగాయన్నారు. రానున్న రోజుల్లో వైసిపికి బుద్ధి చెప్పి టిడిపి గెలుపునకు అందరూ ఐక్యమత్యంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఇంఛార్జి కర్రోతు బంగారురాజు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, నాయకులు మహంతి చిన్నంనాయుడు, ఆకిరి ప్రసాదరావు మాట్లాడుతూ రైతు సంక్షేమంగా ఉంటేనే దేశం బాగుంటుందని చెబుతూ రైతు నడ్డి విరిసే పని చేస్తున్నారని అన్నారు. రైతులకు వస్తున్న సబ్సిడీ కూడా పూర్తిస్థాయిలో కోత విధించారన్నారు. ప్రజా సంక్షేమం కోసం టిడిపి మహానాడులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నెల్లిమర్ల నియోజకవర్గం నాయకులు పతివాడ తమ్ము నాయుడు, అప్పలనారాయణ, అట్టాడ శ్రీధర్, దూంగ భూలోక, పిడుగు తోటరావు, చందక చిన్నమనాయుడు, ఇజ్జురోతు ఈశ్వరరావు, మహిళా నాయకులు చిల్లా పద్మ, బొంతు ఉమా, భోగాపురం, డెంకాడ నెల్లిమర్ల, పూసపాటిరేగ తెలుగు యువత అధ్యక్షులు తోగులరెడ్డి, రవికిరణ్, నాలం శ్రీనివాసరావు, చాకివలస మాజీ సర్పంచ్ లంక రామ నర్సి, నడుపూరు పాపునాయుడు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

**విజయనగరం కోట:** చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ ఇచ్చిన హామీలలో భాగంగా ఆదివారం టిడిపి నాయకులు




విజయనగరం కోట : ఏరువాకలో భాగంగా దక్కుదున్నతున్న టిడిపి నాయకులు

రాకోడు గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే 'అన్నదాత' పథకం ద్వారా రైతులకు ఏటా రూ. 20వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. గత నాలుగేళ్లుగా ధరలు పెరిగి, సబ్సిడీలు అందక పంట సాగు ఖర్చులు విపరీతంగా పెరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి పోలి నాయుడు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బుచ్చిబాబు, కనకల మురళీమోహన్, వేచలపు శ్రీనివాసరావు, రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలోని తుమ్మికాపల్లి వద్ద ఫర్‌ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. 37 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కడారి రాజు, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయి రమణ, డాక్టర్ రవి చేతులు మీదుగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో ఈ ట్రస్ట్ అంచలంచెలుగా ఎదిగి ఎంతో మంది అనాథ వృద్ధులను ఆదుకోవాలని వాటికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ హరికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కట్టమూరు సతీష్, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, ట్రస్ట్ సభ్యుల సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, గోవిందరావు, మల్లేశ్వరరావు, ధర్మ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

**రోగికి ఆర్థిక సాయం**

మండలంలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన జాయినింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ వీరభద్రపురం గ్రామానికి చెందిన ఎస్.సాయి బాబు సీటీబీస్ (నరాలలో రక్తం స్తంభించుట వ్యాధితో) వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకుని గతంలో రూ. 10,500 ఆర్థిక సాయం అందించారు. కాగా పిల్లలు పోషకార్థం ఇబ్బందికరంగా ఉందని, నెల వారి మందులు ఖర్చులు ఎక్కువ అవ్వటం వల్ల సమస్యగా ఉందని తెలుసుకుని ఆదివారం మరో రూ. 5వేలు



బాధితునికి నగదు అందిస్తున్న జాయినింగ్ హ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

సొసైటీ ద్వారా అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు సిరిమల్ల పైడిరాజు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా గడిచిన రెండేళ్లలో ఎన్నో పేద కుటుంబాలకు, అనాధ వృద్ధులకు దాతల సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గొంప రాంబాబు, సభ్యులు సిరిమల్ల పైడిరాజు పాల్గొన్నారు.

**జామి:** మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హాండ్స్ సేవా సంస్థ ద్వారా ఆదివారం నిరుపేదలైన వంటరి మహిళలు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ముందు ఉంటుదని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

**గురుదేవ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం: ఎంపి**

ఓ మారు మూల కుగ్రామంలో వికలాంగుల అభ్యున్నతి కోసం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దేశంలోని నలుమూలల్లోని దివ్యాంగులకు విశేషంగా సేవలందిస్తున్న శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు కొనియాడారు. మండలంలోని మంగళపాలెంలోని గురుదేవ ట్రస్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చూపాల్సిన గౌరవం కొరవడిందనే విషయం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బీజేపీ పాలన రాగానే వికలాంగులానే పదాన్ని వాడొద్దని, దివ్యాంగులుగా వారిని గౌరవించాలనే మంచి ఉద్దేశ్యంతో ప్రధాని మోదీ 2016లో చట్టం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా 25లక్షల మంది దివ్యాంగులకు వివిధ రకాల ఉపకారణాలను మోదీ అందజేశారని గుర్తుచేశారు. ట్రస్ట్ అభ్యున్నతికి, దివ్యాంగుల సంక్షేమానికి గానూ కేంద్ర ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగాణంలోని అవయవ తయారీ కేంద్రాన్ని, గురుదేవ హాస్పటల్‌ను సందర్శించారు. పలువురు దివ్యాంగులకు కత్రిమ కాళ్ళు, చేతులు, వినికిడి పరికరాలు, ఉపకారణాలను జి.వి.ఎల్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకుడు రవికుమార్, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ ఫణీంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి కీర్తి శిఖరం ఎస్‌పి బాలు

ప్రజాశక్తి - జామి

ప్రపంచంలోనే అద్భుతమైన గాయకుడిగా పేరు తెచ్చుకున్న మహోన్నత వ్యక్తి తెలుగు జాతి కీర్తి శిఖరం ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యమని డాక్టర్ పివిజి రాజు కళావేధిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. ఆదివారం మండలంలోని అట్టాడ బిఎన్ఆర్ ఆశ్రమంలో బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 భాషల్లో దాదాపు 45 వేల పాటలు పాడిన బాలు భారతీయ సంగీత విద్వాంసులు మనోఫలకంపై చెరగని ముద్ర వేశారన్నారు. సంగీత సామ్రాజ్యాన్ని అర్ధాంతరంగా వదిలి వెళ్లిపోయిన బాలు, తన కమ్మని గొంతుతో పాడిన పాటలు ప్రపంచ వ్యాప్తంగా సంగీత అభిమానులకు అందచేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం బాలు పుట్టినరోజు సందర్భంగా వేడుకలు చేయాలనీ, బాలుపేరుతో యువ సంగీత కళాకారులకు అవార్డులు అంద చెయ్యాలని కోరారు.

**మృతులకు ఘన నివాళులు అర్పించిన వృద్ధులు**

ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బహనగా బజార్




బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీశెట్టి

స్టేషన్ వద్ద జరిగిన కోరమండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో మృతి చెందిన సుమారు 288 ఆత్మకి శాంతి కలగాలని బిఎన్ఆర్ ఆశ్రమంలోని వృద్ధులు కొవ్వొత్తులను వెలిగించి ఘన నివాళు లు అర్పించారు. ప్రమాదంలో గాయపడిన సుమారు 1175 మంది త్వరగా కోలుకోవాలని, ప్రమాదంలో చనిపోయిన పేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత రీతిన ఆదుకోవాలని, వారికి విద్యా, ఉపాధి అవకాశాలు అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆశ్రమం నిర్వాహకులు మట్టా రామగున్న, అచ్చిరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో జ్యేష్టాభిషేకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం జ్యేష్టాభిషేకాలు జరిగాయి. ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు శ్రీరామచంద్రస్వామి వారికి ఉష్ణతాప నివారణ కొరకు అభిషేకం నిర్వహిస్తుంటామని ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు తెలిపారు. దీనిలో భాగంగా ప్రాతఃకాలర్చన, అనంతరం బాలబోగం తర్వాత ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనారాధన పుణ్యాహవచం నవకల శారదన అర్చకులు నిర్వహించి జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామి వారికి పంచామృతాలు, పళ్ళరసాలు వివిధ నది జలాలతో అభిషేకం వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం వాస్తవ్యులు అయ్యల సోమయాజుల బాస్కరరావు కుటుంబ సభ్యులు అబిషేక ద్రవ్యాలు కైంకర్యం చేశారు.



జేష్టాభిషేకం చేస్తున్న అర్చకులు

**దేవాలయంలో సామూహిక వ్రతములు**

మండలంలోని కొత్తపేట గ్రామం రామతీర్థం దారిలో ఉన్న చిన్న అన్నవరం రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయించుకున్నారు. ఆలయ ధర్మకర్త కొండేటి సురేష్ మాట్లాడుతూ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో చిన్న అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంగా అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కళ్యాణ మండపాల నిర్మాణం చేసి ఇదే దేవాలయ ఆవరణలో పెళ్లిళ్ల సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రతినెల పౌర్ణమి, ఏకాదశి నాడు చేయిస్తామన్నారు.

## కొల్లిపేటలో తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని భోగాపురం మేజర్ పంచాయతీ కొల్లిపేటలో గ్రామస్తులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులకు ఒకసారి కొళాయిలు ద్వారా నీరు రావడంతో అవస్థలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం సమీపంలోని చేతిపంపు వద్దకు చేరి నీళ్ల పట్టుకుంటున్నారు. అందరూ చేతి పంపుపై ఆధారపడటంతో అక్కడ కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదరవుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై కార్యదర్శి



బోరు వద్ద వేచి ఉన్న మహిళలు

రామకృష్ణను వివరణ కోరగా.. సమస్య అయితే ఉందని, గ్రామానికి వెళ్లే తాగునీరు బోరు పాడైందని, రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, ఇప్పటికే పరిశీలించామని, తెలిపారు. గ్రామం ఉన్న బావిని కూడా శుభ్రం చేస్తున్నామని నీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు.

## జాతీయ స్థాయి కబడ్డీకి భవానీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి అండర్ -19 బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలకు నెల్లిమర్లకు చెందిన విద్యార్థి తామాడ భవానీ ఎంపికైంది. ఈ నెల 6 నుంచి ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి అండర్ -19 కబడ్డీ పోటీలకు జిల్లా తరపున ఎంపికైనట్లు రిటైర్డ్ పీడీ, కబడ్డీ కోచ్ బొమ్మన రామారావు తెలిపారు. స్థానిక సికెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భవానీ గతంలో అండర్ -17 స్కూల్ గేమ్స్, జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్, ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించినట్లు ఆయన వెల్లడించారు. కాగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన భవానీని సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్య నారాయణ, నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షులు బోని సూర్యనారాయణ, నగర పంచాయతీ పెద్దలు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.




తామాడ భవానీ

## ఎంపిడిఒగా అప్పలనాయుడు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం ఎంపిడిఒగా ఎస్ అప్పల నాయుడు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు భోగాపురం ఎఫ్ఎసి ఎంపిడిఒగా డి. బంగారయ్య వ్యవహరించారు. అప్పలనాయుడు ఇప్పటి వరకు డెంకాడ ఇఒపిఆర్‌డిగా పని చేస్తూ ఉద్యోగోన్నతపై ఎంపిడిఒగా ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఉన్న ప్రత్యేక సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు చేపడతానని తెలిపారు. నాయకులు, తోటి అధికారులతో కలిసి కట్టుగా పనిచేసి మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని గ్రామ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



అప్పలనాయుడు

## నిలిచిన అదనపు గదుల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట వద్ద గల కెజిబివి వసతి గృహంలో అదనపు గదుల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మొదటి విడత నాడు నేడు నిధులు కింద పిల్లర్స్ వరకూ నిర్మాణం చేశారు. నాడు నేడు రెండో విడతలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో గదులు చాలాక పిల్లలు ఇబ్బందే పడే అవకాశం ఉంది. సెలవుల సమయంలోనే నిర్మాణం చేపడితే వారికి ఉపయోగం ఉంటుందని పిల్లల తల్లిదండ్రులు చెబుతున్నారు. అదనపు గదులు నిర్మాణం నిలిచిపోవడంతో సర్వ శిక్ష అభియాన్ జిల్లా కేంద్రం నుంచి మంజూరైన నిధులతో పదో తరగతికి సంబంధించిన గదిని మాత్రం నిర్మించారు. ఇందులో



మధ్యలో నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం

కూడా ఇంకా విద్యుత్ సౌకర్యం, లోపల ప్లాస్టింగులు, గచ్చులు చేయలేదు. పై భాగాన్ని మాత్రం చూడ ముచ్చటగా రంగులు వేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

## గుడివాడలో పగలే వెన్నెల

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని గుడివాడలో గత రెండు రోజులుగా వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నా సంబంధిత గ్రామ సచివాలయ జేఎల్ఎం పట్టించుకోక పోవడం గమనార్హం. విద్యుత్తును వృధా చేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పగలే వెలుగుతున్న విద్యుత్తు దీపాలు

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

ప్రజాశక్తి- భోగాపురం

విశాఖలోని గీతం కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన భార్యాభర్తలు మృతి చెందారు. భోగాపురం మండలంలోని కొండరాజుపాలెం గ్రామానికి చెందిన భార్యభర్తలు మైలపల్లి పెద్దయ్య, పావని తమ మూడేళ్ల పాపతో కలిసి స్వగ్రామం నుంచి బైక్‌పై విశాఖ వెళు తుండగా వాహనం అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. పాప తీవ్ర గాయాలతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతోంది.



మృతి చెందిన భార్యభర్తలు

**నేరాలు ఘోరాలు**

## గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

**జియ్యమ్మవలస:** మండలంలోని డంగభద్ర విఆర్‌ఒ చింతాడ ప్రభాకర్ (42) గుండెపోటుతో శనివారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాలూరు మండలం బాగువలస ఆయన స్వగ్రామం. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మరణం పట్ల స్థానిక సర్పంచ్ సీమల సుజాత, వైసిపి నాయకులు బాబు భువనమోహన్ రావు, తహశీల్దార్ డివి సీతారామయ్య, విఆర్‌ఒ సంఘ నాయకులు సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## 'రజకులను ఎస్‌సిలో చేర్చాలి'

**విజయనగరం టౌన్:** ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని రజక సంఘం అధ్యక్షులు తంగేటి భాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దాసన్నపేట రైతు బజార్ పక్కన రజక సంఘం కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల రజక సంఘం కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జంప చిన్న, సలహాదారు గోవిందు, ఉపాధ్యక్షులు రాము, శ్రీను, తాతారావు, కోశాధికారి రాజారావు పాల్గొన్నారు.త



## పాములకు నిలయంగా మరుగుదొడ్లు

ప్రజాశక్తి - వేపాడ



చెత్తతో నిండి ఉన్న టాయిలెట్స్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్మించిన టాయిలెట్స్ పాములకు నిలయంగా మారింది. ప్రస్తుతం పాఠశాలలకు నాడు నేడు నిధులు వెచ్చించి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. మురుగునీరు, పిచ్చి మొక్కలు మధ్యలో టాయిలెట్స్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లను బాగుచేయాలని కోరుతున్నారు.

## 8న రెండో వైస్ ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఖాళీగా ఉన్న రెండో వైస్ ఎంపిపి స్థానానికి ఈ నెల 8న ఎన్నిక నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఇంతవరకు కొనసాగిన రెండో వైస్ ఎంపిపి (ఎల్ కోట ఎంపిటిసి) దండేకర్ కుమారి అనారోగ్యంతో మృతి చెందిన సంగతి పాఠకులకు విధితమే. అప్పటి నుండి ఖాళీగా ఉన్న రెండో వైస్ ఎంపిపి స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నుండి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. ప్రొసీడింగ్ అధికారిగా డ్వామా ఏపిడి ఎస్ శారదాదేవి వ్యవహరించనున్న ఎన్నికలకు ఆరోజు ఉదయం 10 గంటలలోపు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 11 గంటలలోపు నామినేషన్లు విత్‌డ్రాలు చేసుకోవచ్చని తెలిపారు. ఇదిలా ఉండగా రెండో వైస్ ఎంపిపి స్థానానికి పలువురు ఎంపిటిసిలు పోటీ పడుతున్నట్లు తెలిసింది. వారిలో ఎంపిటిసి యడ్ల కిషోర్ కుమార్‌కు రెండో వైస్ ఎంపిపి పదవి దక్కనున్నట్లు పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన పార్టీలో చురుకైన పాత్ర వహిస్తూ ముందంజలో ఉన్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇదే పదవికి సంతపేట ఎంపిటిసి కలవలపల్లి సత్యవతి పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనప్పటికీ ఈ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

## ముగ్గురు కార్యదర్శులకు బదిలీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలో వివిధ పంచాయతీలో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురికి బదిలీలు జరిగినట్లు ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు తెలిపారు. డిపిఒ కార్యాలయం నుండి అందిన ఉత్తర్వుల ప్రకారం... లక్కవరపుకోట పంచాయతీ కార్యదర్శి కె వెంకటరమణ ప్రతి పనికి లంచాలు గుంజుతున్నారని గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించడం, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించకపోవడం, నెలవారి పంచాయతీ కార్యదర్శుల సమావేశాలకు హాజరు కాకపోవడం, ప్రజలు పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి మొదలగు 8 అంశాలపై 'ప్రజాశక్తి' లో వచ్చిన వరుస కథనాలను స్పందిస్తూ దత్తిరాజేరు మండలానికి బదిలీ చేశారు. కాగా కాసాపేట పంచాయతీ కార్యదర్శి బి లక్ష్మణరావు డెంకాడ, కల్లంపూడి పంచాయతీ కార్యదర్శి పి వెంకటరమణ వేపాడ మండలానికి బదిలీ కోరుకోవడంతో వారికి ఆయా మండలాలకు బదిలీ అయ్యింది.

## తూతూ మంత్రంగా భూ సమగ్ర సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశపడ్డారు. ఇంత వరకు మండలంలో కొన్ని గ్రామాలలో సమగ్ర భూ సర్వే పనులు బృందం చేపట్టింది. సర్వే చేసిన భూములు తాలూకా వివరాలను రైతులకు తెలపకపోవడం, కనీసం సచివాలయాలలోనైనా అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తూతూ మంత్రంగానే సర్వే జరిగిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇంతవరకు సమగ్ర భూ సర్వే చేసిన గ్రామాలలో సమగ్రమైన వివరాలు తెలిపితే ప్రభుత్వ సర్వే పై నమ్మకం కలిగి రైతులు కూడా సర్వేలో పాల్గొని బృందానికి సహకారం లభిస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు.

## పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు పాత నేరస్తులుగా ముద్రపడి పోలీస్ రికార్డుల్లో నమోదైన కొందరిని ఆదివారం పిలిపించి స్టేషన్లో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తి వీడనాడి ప్రజా జీవితాన్ని అలవర్చుకుని కుటుంబ సభ్యులకు మెరుగైన జీవనోపాదులు కల్పించాలని కోరారు. దీని వల్ల క్రమేణా సమాజంలో నేరస్తులన్న పేరు తొలగిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఈ గుర్తింపు ఆధారంగా పోలీస్ రికార్డుల్లో నమోదైన రౌడీషీట్ ఎత్తివేసే వీలు కలుగుతుందన్నారు.



పాత నేరస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ

## బొమ్మల డిజైనింగ్‌పై చిన్నారులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులు పాల్గొన్నారు. కలంకారం ప్రాజెక్ట్ డిజైనర్, కొరియోగ్రాఫర్ కుమారి అల్లు ప్రియాంక నెట్ క్రాఫ్ట్ ఫ్లవర్, బొమ్మల డిజైనింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

## ఒడిశా రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్



ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, విద్యార్థులు

ఒడిశాలోని బాలాసోర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళి అర్పిస్తూ విజయనగరం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అంబటి సత్రం కూడలి వద్దనున్న ప్రెస్ క్లబ్ భవనం నుంచి మూడు లాంతర్లు మీదుగా కోట కూడలి వరకు శ్రీ శ్రీ కోచింగ్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు, డిబిఎస్‌యూ ప్రతినిధులతో కలిసి నగర జర్నలిస్టులు మౌన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కోట కూడలి వద్ద క్యాండిల్స్ వెలుగించి, కొద్ది సేపు మౌనం పాటిస్తూ మృతుల ఆత్మలకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్ మాట్లాడుతూ దేశంలోనే ఇదొక దురదృష్టకరమైన ప్రమాదమని అన్నారు. క్షతగాత్రులను ఆదుకోవాలని, మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంపై రైల్వే రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ ఘటన పై నిష్పక్షపాత విచారణ జరగాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎంఎంఎల్ నాయుడు, పిఎస్ఎస్ వి ప్రసాద్, సిహెచ్ జైరాజ్, రమేష్ నాయుడు, బోను శ్రీనివాసరావు, జి శివ ప్రసాద్, బి దేవిడ్ రాజు, ప్రతాప్, ఆర్ ఈశ్వర్ రావు, బి సుధీర్, మధు రెడ్డి, దాలిరాజు, కె ఉమామహేశ్వరరావు, ప్రకాష్ రావు, భాను, కామేశ్వర రావు, సూర్య ప్రకాష్, శ్రీ శ్రీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పొట్నూరు శ్రీనివాసరావు, డిబిఎస్‌యూ స్టేట్ సెక్రెటరీ పి చిట్టిబాబు, ప్రతినిధి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ముషిడిపల్లి పంప్ హౌస్ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు, వర్షం వల్ల పంపు హౌస్ నుండి ఊటబావులకు వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలు, కండక్టర్ వైర్లు మరమ్మతులకు గురయ్యాయని, దీంతో ఊట బావుల నుండి వాటర్ పంపింగ్ జరపడానికి వీలుపడటం లేదని ఈఈ కె శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ముషిడిపల్లి నీటి సరఫరా నుండి కంటోన్మెంట్ ప్రాంతంలో రెండు రోజులపాటు నీటి పంపిణీకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు, నీటి సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని తెలిపారు. మరో రెండు రోజుల్లో పై డివిజన్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కావున ప్రజలు సహకరించవలసిందిగా ఆయన కోరారు.